**మెలనిస్టిక్ టైగర్ పార్క్**

ప్రపంచంలో తొలిసారి 'మెలనిస్టిక్ టైగర్ సఫారీ'ని ఒడిశాలోని సిమ్లిపాల్ టైగర్ రిజర్వ్‌లో ఏర్పాటు చేయనున్నారు. ట్రాన్స్‌మెంబ్రేన్ అమైనోపెప్టిడేస్ క్యూ అనే ఒక జన్యువు ఉత్పరివర్తనం మూలంగా మెలనిస్టిక్ పులులు ఆవిర్భవిస్తాయి. ఇప్పటికే ఈ తరహా పులులు సిమ్లిపాల్ టైగర్ రిజర్వ్‌లో ఉన్నాయి.

## అంతర్జాతీయం

**జీ-77**



- 'ఏ ఒక్కరిని విస్మరించరాదు' అనే ఇతివృత్తంతో జీ-77 సమావేశాన్ని ఉగాండలోని కంపాలలో నిర్వహించారు. అభివృద్ధి, సాంకేతిక ఫలాలు అందరికీ చేరేలా ప్రణాళికలను రూపొందించాలని సమావేశం అభిప్రాయపడింది. జనవరి 20 నుంచి 23 వరకు ఈ సమావేశాన్ని కొనసాగించారు. ఈ కూటమిలో మొత్తం సభ్య దేశాల సంఖ్య 134. భారత్ తరఫున విదేశాంగ వ్యవహారాల రాష్ట్ర మంత్రి మురళీధరన్ హాజరయ్యారు.

**అత్యంత వేడి సంవత్సరం**

- అత్యంత వేడి సంవత్సరం 2023 అని ప్రపంచ వాతావరణ సంస్థ అధికారికంగా ధ్రువీకరించింది. పారిశ్రామికీకరణకు ముందున్న ఉష్ణోగ్రతల కంటే 1.5 డిగ్రీ సెల్సియస్ మేర సరాసరి పెరిగినట్లు నమోదయ్యిందని పేర్కొంది.

**నామ్ సదస్సు**

- అలీన ఉద్యమ దేశాల సదస్సును కూడా ఉగాండలోని కంపాలలో నిర్వహించారు. ఇజ్రాయెల్, హమాస్ యుద్ధం పరిణామాలు, భారత్ చేపడుతున్న విశ్వమిత్ర్ కార్యక్రమాన్ని ఇందులో ప్రధానంగా చర్చించారు.

**డెజర్ట్ నైట్**



- భారత్, ఫ్రాన్స్, యూఏఈ డెజర్ట్ నైట్ పేరుతో సైనిక విన్యాసాలను అరేబియా సముద్రంపై నిర్వహించాయి. జనవరి 23న ఇది కొనసాగింది.

**సీవోఎఫ్ఐ సబ్-కమిటీ**

- రోమ్ కేంద్రంగా పనిచేసే ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థకు సంబంధించిన కమిటీ ఆన్ ఫిషరీస్‌కు చెందిన ఒక సబ్ కమిటీకి భారత్ వైస్ చైర్మన్‌గా ఎంపికయ్యింది. ప్రపంచంలో చేపల ఎగుమతిలో చెప్పుకోదగ్గ స్థాయిలో భారత్ ఉంది. అలాగే ఇదే సంస్థకు చెందిన ఫిషరీస్ బ్యూరో ఆన్ క్యాప్చర్ ఫిషరీస్ కూడా భారత్ సభ్య దేశం అయింది. 57 సంవత్సరాల తర్వాత ఇందులో భారత దేశం స్థానాన్ని పొందింది.

**మలథియాన్**



- మిడతల నుంచి పంటలను రక్షించుకొనేందుకు 40 వేల లీటర్ల మలథియాన్‌ను భారత్ అఫ్గానిస్థాన్‌కు అందివ్వనుంది. మిడతలను నిరోధించడంతో పాటు ఇది పర్యావరణానికి పెద్దగా కీడును కలిగించదు.

**మలేరియా వ్యాక్సిన్**

- చిన్నారులకు మలేరియా రాకుండా వ్యాక్సిన్ ఇచ్చే కార్యక్రమాన్ని తొలిసారి కామెరూన్ దేశం చేపట్టింది. 2,50,000 మంది చిన్నారులకు ఈ వ్యాక్సిన్‌ను ఇవ్వనున్నారు. జీఏవీఐ సంస్థ సహకారంతో ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ప్రపంచంలో నమోదవుతున్న మలేరియా మృతుల్లో 95% ఆఫ్రికా ఖండంలో సంభవిస్తున్నవే.

**టర్కీ పార్లమెంట్**

- నాటో కూటమిలోకి స్వీడన్ చేరికను అనుమతిస్తూ టర్కీ పార్లమెంట్ తీర్మానాన్ని ఆమోదించింది. నాటో బ్రసెల్స్ కేంద్రంగా పనిచేస్తుంది. ఒక కొత్త దేశం చేరాలంటే నాటోకు చెందిన నియమావళిలోని ఆర్టికల్ 10 ప్రకారం అన్ని సభ్య దేశాలు అంగీకరించాలి. ఇప్పటికే నాటోలో 30 దేశాలు ఉన్నాయి. స్వీడన్, ఫిన్‌లాండ్ కొత్తగా చేరనున్నాయి. ఆ ప్రక్రియ గత 20 నెలలుగా కొనసాగుతుంది.

**భారత్-స్విట్జర్లాండ్**

- 16 సంవత్సరాలుగా చర్చల్లో ఉన్న భారత్, స్విట్జర్లాండ్ వివిధ అంశాలు కొలిక్కి వచ్చాయి. ఇరు దేశాలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. దావోస్ వేదికగా నిర్వహించిన ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో భాగంగా భారత వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్, స్విట్జర్లాండ్ ఆర్థిక శాఖ మంత్రి పర్మెలిన్ చర్చించి ఒప్పందానికి ఆమోదం తెలిపారు.

**సైక్లోన్**



- భారత్, ఈజిప్ట్ ప్రత్యేక బలగాలు సైక్లోన్ అనే పేరుతో సైనిక విన్యాసాన్ని ప్రారంభించాయి. జనవరి 22న ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 1వ తేదీ వరకు కొనసాగుతాయి. ఈజిప్ట్‌లోని అన్‌షాస్ అనే ప్రాంతంలో వీటిని నిర్వహించారు

## పద్మ అవార్డులు



**పద్మ విభూషణ్**

వైజయంతి మాల– కళలు, తమిళనాడు
చిరంజీవి– కళలు, ఏపీ
వెంకయ్య నాయుడు– ప్రజా వ్యవహారాలు, ఏపీ
బిందేశ్వర్ పాఠక్– సామాజిక సేవ, బిహార్
పద్మా సుబ్రమణ్యం– కళలు, తమిళనాడు

**పద్మ భూషణ్**

ఫాతిమా బీవీ– ప్రజావ్యవహారాలు, కేరళ
హోర్ముస్జి ఎన్ కామా– సాహిత్యం–విద్య–జర్నలిజం, మహారాష్ట్ర
మిథున్ చక్రవర్తి– కళలు, పశ్చిమబెంగాల్
సీతారాం జిందాల్– వాణిజ్యం, కర్ణాటక
యంగ్‌లీ– వాణిజ్యం, తైవాన్
అశ్విన్ బాలచంద్– వైద్యం, మహారాష్ట్ర
సత్యబ్రత ముఖర్జీ– ప్రజా వ్యవహారాలు, పశ్చిమబెంగాల్
రామ్ నాయక్– ప్రజా వ్యవహారాలు, మహారాష్ట్ర
మధుసూదన్ పటేల్– వైద్యం, గుజరాత్
రాజ్‌గోపాల్– ప్రజా వ్యవహారాలు, కేరళ
దత్తాత్రేయ అంబదాస్– కళలు, మహారాష్ట్ర
టోగ్డన్ రింపోచే– ఆధ్యాత్మికం, లడఖ్
ప్యారేలాల్ శర్మ– కళలు, మహారాష్ట్ర
ప్రసాద్ ఠాకూర్– వైద్యం, బిహార్
ఉషా ఉతుప్– కళలు, పశ్చిమబెంగాల్
విజయ్‌కాంత్– కళలు, తమిళనాడు
కుందన్ వ్యాస్– సాహిత్యం–విద్య–జర్నలిజం, మహారాష్ట్ర

**పద్మశ్రీ పొందిన తెలంగాణ వ్యక్తులు**

దాసరి కొండప్ప– కళలు
గడ్డం సమ్మయ్య– కళలు
కేతావత్ సోమ్‌లాల్– సాహిత్యం–విద్య
కూరెళ్ల విఠలాచార్య– సాహిత్యం–విద్య
ఆనందాచారీ– కళలు

## తెలంగాణ

**పబ్లిక్ సర్వీస్ కమిషన్**



- తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా మహేందర్ రెడ్డి నియమితులయ్యారు. ఆయన డీజీపీగా పనిచేశారు. సభ్యులుగా అనిత రాజేంద్ర, అమీర్ ఉల్లా ఖాన్, నర్రి యాదయ్య, ఎరబడి రామ్మోహన్ రావు, పాల్వాయి రజని కుమారి.

**కొత్త గ్యాలరీల ఏర్పాటు**

- హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియంలో కొత్తగా ఐదు గ్యాలరీలను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. అవి 1. భారత శిల్పకళ గ్యాలరీ 2. బిద్రీవేర్ గ్యాలరీ 3. ల్యాంప్– షాండ్లియర్ గ్యాలరీ 4. యూరోపియన్ బ్రాంజ్ గ్యాలరీ 5. యూరోపియన్ మార్బుల్ గ్యాలరీ.

**నౌకాదళ రాడార్ స్టేషన్**



- భారత నౌకాకదళానికి చెందిన రాడార్ కేంద్రాన్ని తెలంగాణలోని వికారాబాద్ జిల్లాలో పూడూరు మండలం దామగుండం రక్షిత అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్నారు. దేశంలో ఇది రెండో వీఎల్ఎఫ్ (వెరీ లో ఫ్రీక్వెన్సీ) కమ్యూనికేషన్ ట్రాన్స్‌మిషన్ స్టేషన్. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం 1174 హెక్టార్ల భూమిని నౌకాదళానికి అప్పగించింది. తొలి స్టేషన్ తమిళనాడు రాష్ట్రంలో ఉంది.

**కాస్మోటిక్స్ పరిశ్రమ**

- దేశంలో తొలి కాస్మోటిక్ ఉత్పత్తుల కేంద్రం హైదరాబాద్‌లో ఏర్పాటు కానుంది. దక్షిణ కొరియాకు చెందిన డూసన్ అనే సంస్థ దీన్ని ఏర్పాటు చేసింది.

**ఇంజినీరింగ్ కళాశాల**

- రాష్ట్రంలో తొలి ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను కొడంగల్‌లోని కోస్గిలో ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న పాలిటెక్నిక్ కళాశాలను ఆధునీకరించి ఇంజినీరింగ్ కళాశాలగా మార్చనున్నారు.

**సలహాదారులు**

- ముఖ్యమంత్రి సలహాదారుగా వేం నరేందర్ రెడ్డి నియమితులయ్యారు. అలాగే రాష్ట్రం తరఫున ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధిగా మల్లు రవి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలకు సలహాదారుగా షబ్బీర్ అలీని నియమించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రోటోకాల్, ప్రజా సంబంధాల విభాగాలకు సలహాదారులుగా హర్కర వేణుగోపాల్ నియమితులయ్యారు.

**న్యాక్‌కు అవార్డు**

- మాదాపూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌కు ఇంటర్నేషనల్ లీడర్‌షిప్ ఎక్సలెన్స్ అవార్డ్–2023 దక్కింది. నిర్మాణ రంగంలో నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నందుకు ఈ అవార్డును ఆ సంస్థ గెలుచుకుంది.




## వార్తల్లో వ్యక్తులు

**ప్రసన్న బి.వరాలే**

- సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా ప్రసన్న బి.వరాలే నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం కర్ణాటక హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు.

**కర్పూరీ ఠాకూర్**



- బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న అవార్డును ప్రకటించారు. సామాజిక న్యాయం కల్పించడం కోసం ఆయన చేసిన కృషికి ఈ అవార్డు దక్కింది. ముఖ్యంగా ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన బిహార్‌లోని పితుఝియా అనే ప్రదేశంలో జన్మించారు. ఇప్పుడు ఆ ప్రదేశాన్ని కూడా కర్పూరీ గ్రామ్ పేరుతో పిలుస్తున్నారు. అలాగే ఆ రాష్ట్రంలోని బక్సర్‌లో ఉన్న న్యాయ కళాశాలకు కూడా ఆయన పేరు పెట్టారు.

## జాతీయం



**రామమందిరం**

- అయోధ్య రామాలయంలో జనవరి 22న బాలరామ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో బాల రాముడి విగ్రహాన్ని గర్భగుడిలో ప్రతిష్ఠించారు. నాగర శైలిలో అయోధ్య రామాలయాన్ని నిర్మించారు. అదే రోజున ప్రధాన మంత్రి సూర్యోదయ యోజన అనే పథకాన్ని కూడా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా కోటి గృహాల్లో రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం.

**సంస్కరణలు అనివార్యం**

- ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో సంస్కరణలు అనివార్యంగా రావాలని ఐక్యరాజ్య సమితి 78వ అధ్యక్షుడు డెన్నిస్ ఫ్రాన్సిస్ అభిప్రాయపడ్డారు. జనవరి 22 నుంచి 26 వరకు ఆయన భారత్‌లో పర్యటించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. భద్రతా మండలి మరింత ప్రజాస్వామ్యయుతంగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. కేవలం ఐదు దేశాలకే భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం ఉండటం, అవి వీటో అధికారాన్ని కలిగి ఉండటం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు.

**హమారా సంవిధాన్ హమారా సమ్మాన్**

- భారత్ 75వ గణతంత్ర రోజు నిర్వహించుకుంటున్న సందర్భంగా హమారా సంవిధాన్ హమారా సమ్మాన్ కార్యక్రమాన్ని ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ ప్రారంభించారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు న్యాయం చేసేందుకు న్యాయ సేతు కార్యక్రమాన్ని కూడా ఈ సందర్భంగా ప్రారంభించారు.

**పరిశోధనకే ప్రాధాన్యం**

- భారత రక్షణ రంగ పరిశోధన సంస్థ (డీఆర్‌డీవో) పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని విజయ రాఘవన్ ప్యానెల్ నివేదిక పేర్కొంది. డీఆర్‌డీవో పనితీరుకు సంబంధించి తొమ్మిది మందితో కూడిన కమిటీ ఏర్పాటయ్యింది. మిషన్ మోడ్ కింద 55 ప్రాజెక్టులను అప్పగించగా 23 నిర్దేశిత సమయానికి పూర్తి కాలేదని పేర్కొంది. ఉత్పత్తికి కాకుండా పరిశోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రధాన మంత్రి నేతృత్వంలో రక్షణ సాంకేతిక మండలిని ఏర్పాటు చేయాలని సూచించింది. ఇందులో రక్షణ మంత్రి, జాతీయ భద్రత సలహాదారులు కూడా ఉండాలని పేర్కొంది.

**ఖంజర్**

- భారత్, కిర్గిజిస్థాన్ ఖంజర్ పేరుతో 11వ సైనిక విన్యాసాన్ని హిమాచల్ ప్రదేశ్‌లోని బాక్లోలో నిర్వహించాయి. జనవరి 22న ప్రారంభమైన ఈ విన్యాసాలు ఫిబ్రవరి 3 వరకు కొనసాగనున్నాయి.



**లైసెన్స్ రద్దు**

- సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్, వరల్డ్ విజన్ ఇండియా అనే స్వచ్ఛంద సంస్థల లైసెన్స్‌ను రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఎఫ్‌సీఆర్ఏ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఈ చర్య తీసుకుంటారు. ఎఫ్‌సీఆర్ఏ అంటే ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేటింగ్ యాక్ట్. 1976లో ఈ చట్టం చేశారు.

## క్రీడలు



**ఫిట్ ఇండియా చాంపియన్స్**

- ఫిట్ ఇండియా చాంపియన్స్ పేరుతో త్వరలో కొత్త కార్యక్రమాన్ని కేంద్ర క్రీడ మంత్రిత్వ శాఖ ప్రారంభించనుంది. నీరజ్ చోప్రా, శీతల్ దేవి తదితర క్రీడాకారులతో ప్రారంభించిన పోడ్‌కాస్ట్ ఇది. మొత్తం 10 భాగాల్లో ఈ సీరియల్ ఉండనుంది. డిజిటల్‌తో పాటు వివిధ సోషల్ మీడియా వేదికగా ఇది ప్రసారం అవుతుంది. క్రీడల్లో అత్యున్నత స్థానాల్లోకి వెళ్లిన వాళ్లకు సంబంధించి ఇందులో అంశాలు ఉంటాయి.

**వి. రాజేంద్ర శర్మ**
ఫ్యాకల్టీ
9849212411

